క్లుప్తంగా

యోగాతో మానసిక ప్రశాంతత

తెనాలి అర్బన్: యోగాతో శారీరక, మానసిక ప్రశాంతత లభిస్తుందని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న పేర్కొన్నారు. యోగా ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా తెనాలి పురపాలక సంఘం ఆధ్వర్యంలో బోసు రోడ్డులోని శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో శనివారం యోగా శిక్షణ తరగతులు నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నార్త్ ఇండియాకు చెందిన శిక్షకులు శిక్షణ ఇచ్చారు. శిక్షణ శిబిరాన్ని కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా దినోత్సవాన్ని ప్రతిష్టాత్మకంగా ప్రభుత్వం నిర్వహించనున్నట్లు చెప్పారు. విశాఖపట్నంలో జరిగే వేడుకల్లో ప్రధాని మోదీ ముఖ్య అతిథిగా పాల్గొంటారని వివరించారు. దీనిలో భాగంగా ప్రతిరోజు తెనాలి పట్టణంలో వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ వి.ఎం.లక్ష్మీపతిరావు, ఆర్వో రాం ప్రసాద్, పలువురు మున్సిపల్ అధికారులు, యోగ సాధకులు పాల్గొన్నారు.

నేడు ప్రముఖ శిల్పకారులకు సత్కారం

తెనాలి: ప్రముఖ స్వచ్ఛంద సేవాసంస్థ మానవత, తెనాలి శాఖ సర్వసభ్య సమావేశం ఆదివారం ఏఎస్ఎన్ డిగ్రీ కాలేజీ లైబ్రరీ ఆవరణలో ఉదయం 9 గంటలకు నిర్వహించనున్నారు. సమావేశానికి చైర్మన్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్ అధ్యక్షత వహిస్తారు. ఏడు తరాలుగా శిల్పకళకు అంకితమైన కుటుంబం నుంచి వచ్చి, ఆ కళా వారసత్వాన్ని నాలుగు దశాబ్దాలుగా కొనసాగిస్తున్న కాటూరి వెంకటేశ్వరరావు, ఆయన కుమారులు కాటూరి రవిచంద్ర, కాటూరి శ్రీహర్షను ఇదే సమావేశంలో సత్కరిస్తారు. శిల్పకళతో జాతీయ, అంతర్జాతీయ గుర్తింపును పొందిన కాటూరి వెంకటేశ్వరరావు ఇటీవల రాష్ట్రప్రభుత్వ 'కళారత్న' అవార్డును స్వీకరించిన విషయం తెలిసిందే. ఆయన కుమారులైన రవిచంద్ర గవర్నర్ అవార్డును, కాటూరి శ్రీహర్ష కొండూరి వీరరాఘవాచార్యులు పురస్కారాలను అందుకున్నారు. ఈ సందర్భంగా శిల్పకళా కుటుంబాన్ని 'మానవత' సత్కరించనుందని డాక్టర్ రామ్‌చంద్ వెల్లడించారు.

వైభవంగా హనుమత్ జయంత్యుత్సవాలు



తెనాలి: స్థానిక షరాఫ్ బజార్‌లో ఉన్న శ్రీ సువర్చలా సమేత శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి దేవస్థానంలో వార్షిక హనుమత్ జయంతి మహోత్సవాలు, 17వ లక్ష శ్రీ హనుమాన్ చాలీసా పారాయణ కార్యక్రమాలు శనివారం ప్రారంభమయ్యాయి. ఉదయం స్వామికి విశేష పూజలు, శ్రీ మన్య సూక్త హోమం, సిందూర అర్చనను ఆలయ వంశపారంపర్య అర్చకుడు రొంపిచర్ల శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో ఆగమోక్తంగా నిర్వహించారు. సాయంత్రం లక్ష శ్రీ హనుమాన్ చాలీసా పారాయణ చేశారు. ఆలయ ఈవో అవుతు శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ 11 రోజులు పాటు జరిగే ఉత్సవాల్లో ప్రతిరోజు విశేష పూజలు, హోమాలు జరుగుతాయని తెలిపారు. భక్తులు విశేషంగా పాల్గొని స్వామిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

ఏటీఎం చోరీకి విఫల యత్నం


తెనాలి రూరల్: పట్టణంలో ఏటీఎం చోరీకి దుండగులు శుక్రవారం తెల్లవారుజామున విఫల యత్నం చేశారు. ఇక్కడి గాంధీచౌక్ సమీపంలోని ఎస్‌బీఐ ఏటీఎంను పగులకొట్టి నగదును దోచుకునేందుకు ప్రయత్నించారు. అలారం మోగడంతో పరారయ్యారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పలు ప్రాంతాలకు తరలి వెళ్లిన ఎన్‌టీఆర్ విగ్రహాలు

తెనాలి అర్బన్: తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యంత్రి నందమూరి తారక రామారావు 97వ జయంతిని పురస్కరించుకుని రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ప్రతిష్ఠించేందుకు విగ్రహాలు శనివారం తెనాలిలోని సూర్య శిల్పశాల నుంచి తరలి వెళ్లాయి. వైఎస్సార్ కడప జిల్లా బ్రహ్మం గారి మఠం సమీపంలోని కమ్మ సత్రంలో ఒకటి, మైదుకూరు పట్టణంలో ఒకటి, అనంతపురం జిల్లా గుంతకల్లులో ప్రతిష్టించేందుకు భారీ కాంస్య విగ్రహాలు వెళ్లాయని శిల్పులు కాటూరి వెంకటేశ్వరరావు, కాటూరి రవిచంద్ర తెలిపారు.

చచ్చే చావుకు వస్తోంది !

- జనన, మరణ ధ్రువీకరణ పత్రాలకు అవస్థలు
- నెలలు దాటుతున్న మంజూరు కాని పత్రాలు
- నిబంధనలు పాటించని తెనాలి వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు
- కార్యాలయం చుట్టూ తిరుగుతున్న ప్రజలు



మున్సిపల్ కార్యాలయంలోని జనన, మరణ ధ్రువ పత్రాల జారీ విభాగం

తెనాలి అర్బన్: జనన, మరణ ధ్రువపత్రాల జారీలో తీవ్ర జాప్యం నెలకొంటోంది. దరఖాస్తుదారులు చెప్పులరిగేలా కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. సంబంధిత సర్టిఫికెట్లు జత చేసినా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ఆన్‌లైన్‌లో వచ్చిన వివరాలను పరిశీలించి ఆమోదం(డిజిటల్ వేలిముద్ర) తెలపడం లేదు. దీంతో దరఖాస్తుదారులు పత్రాల కోసం కార్యాలయాల చుట్టూ నెలల కొద్దీ తిరుగుతున్నారు. తెనాలి పట్టణంలో సుమారు రెండు లక్షల జనాభా నివసిస్తున్నారు. ఎవరైనా నూతనంగా జన్మించినా, మరణించినా మీసేవా, వార్డు సచివాలయాల ద్వారా 30 రోజుల్లో దరఖాస్తు చేసుకోవాలి. ఆ తర్వాత ఏడు రోజుల్లో మున్సిపల్ ఆరోగ్యాధికారులు సర్టిఫికెట్లను జారీ చేస్తుంటారు. తెనాలి పురపాలక సంఘ పరిధిలో నెలకు సగటున జనన ధ్రువపత్రాలు -87, మరణ ధ్రువపత్రాలు-115 జారీ చేస్తుంటారు.

30 రోజులు దాటితే కష్టాలే...

తెనాలి పట్టణంలో తల్లీపిల్లల వైద్యశాలతో పాటు 45 ప్రైవేటు ఆస్పత్రులు ఉన్నాయి. వీటిలో జన్మించిన చిన్నారులు వివరాలను ఆయా ఆస్పత్రుల యజమాన్యాలు డీసీసీఆర్‌సీ సెంట్రల్ సర్వర్‌లో నమోదు చేస్తారు. 30 రోజుల్లో అలా చేసిన వారి వివరాలు ఆర్‌టీజీఎస్ వెబ్‌సైట్ ద్వారా తెనాలి పురపాలక సంఘ ఆరోగ్యాధికారి లాగిన్‌కు వస్తాయి. వెంటనే ఇక్కడ అప్ రూల్ చేసి సర్టిఫికెట్‌ను జారీ చేస్తారు. నిర్ణీత 30 రోజుల తర్వాత నమోదు చేస్తే అలాంటి వారి జనన వివరాలు గుంటూరులోని డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయంలోని జనన, మరణ విభాగంలోని లాగిన్‌కు వెళ్తాయి. వారు ఆలస్యానికి గల కారణాలు హాస్పిటల్ నుంచి తెలుసుకుని, తర్వాత వాటికి ఆమోదం తెలుపుతారు. అక్కడి నుంచి తెనాలి పురపాలక సంఘ లాగిన్‌కు వస్తాయి. వీరు ఆమోదం తెలిపి సర్టిఫికెట్ జారీ చేస్తారు. అయితే, గుంటూరు పంపిన పత్రాలకు వెంటనే అనుమతులు రావడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పత్రాల జారీలో జాప్యం

మరణ ధ్రువీకరణ పత్రాల కోసం 21 రోజుల్లో మీసేవా, వార్డు సచివాలయాల ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. 21 రోజుల తర్వాత నుంచి 30 రోజులలోపు అపరాధ రుసుంతో చేసుకోవచ్చు. హెల్త్ అసిస్టెంట్ విచారణ జరుపుతారు. దానిలో మరణ కారణం నిర్ధారణ అయితే సర్టిఫికెట్‌ను జారీ చేస్తారు. 30 రోజుల తర్వాత అయితే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వివరాలు తెనాలి పురపాలక సంఘ హెల్త్ అసిస్టెంట్లు విచారణ జరిపి, వారి రిపోర్ట్‌తో గుంటూరులోని డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయానికి పంపుతారు. వారు ఏడు రోజుల్లో వాటికి అనుమతులు ఇవ్వాల్సి ఉంటుంది. కానీ, అలా జరగడం లేదు. ఆరు నెలల నుంచి మున్సిపల్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా నేటికి గుంటూరు నుంచి అనుమతులు రావటం లేదని పలువురు దరఖాస్తుదారులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పత్రాలలో జరుగుతున్న జాప్యాన్ని నివారించే విధంగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. వివరణ కోసం గుంటూరు డీఎంఅండ్‌హెచ్‌వోకు ఫోన్ చేయగా ఆమె లిఫ్ట్ చేయలేదు.

కూలిన శివాలయం ప్రహరీ



అర్ధరాత్రి కూలిన ప్రహరీ

ప్రత్తిపాడు: ప్రత్తిపాడులోని శ్రీ గంగా పార్వతీ సమేత దండేశ్వరాలయం (శివాలయం) తూర్పు ప్రహరీ గోడ శుక్రవారం అర్ధరాత్రి కూలిపోయింది. గత వారం రోజులుగా కురుస్తున్న అకాల వర్షాల కారణంగా ఆలయ ప్రహరీ గోడ నేలకొరిగి ఉంటుందని అర్చకులు, స్థానికులు భావిస్తున్నారు. వర్షానికి తడిసిన గోడ రాళ్ల గుట్ట పక్కనే ఉన్న సీసీ రోడ్డుపై పడిపోయింది. అర్ధరాత్రి జనసంచారం లేని సమయం కావడంతో ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగలేదు. కూలిన ప్రదేశంలోనే బావి, నవగ్రహాలు ఉంటాయి. అదే భక్తుల తాకిడి ఉన్న సమయంలో జరిగి ఉంటే పెనుప్రమాదం సంభవించి ఉండేది. ఉదయాన్నే ఆలయానికి వచ్చిన అర్చకులు పత్తిపాటి పరమేశ్వర శర్మ గోడ కూలిపోయి ఉండడాన్ని గమనించి విషయాన్ని దేవదాయశాఖ అధికారులకు తెలియజేశారు. గతంలోనూ ఉత్తరం, పడమర, దక్షిణ దిక్కుల్లోని ప్రహరీ గోడలు పడిపోయిన సందర్భాలు ఉన్నాయి. తాజాగా ఇప్పుడు మిగిలిన నాలుగో దిక్కు ప్రహరీ గోడ కూలిపోవడం స్థానికంగా చర్చనీయాంశమయ్యింది.

అగ్రికల్చర్ కళాశాలలో క్యాంపస్ ఇంటర్వ్యూలు



ఇంటర్వ్యూల్లో పాల్గొన్న విద్యార్థులు

ప్రత్తిపాడు: మండల పరిధిలోని యనమదల బి.ఆర్ అండ్ ధనలక్ష్మి పాలిటెక్నిక్ ఆఫ్ అగ్రికల్చర్ కళాశాలలో శనివారం క్యాంపస్ ఇంటర్వ్యూలను నిర్వహించారు. అగ్రికల్చర్ పాలిటెక్నిక్ పూర్తి చేసిన విద్యార్థులకు విజయవాడ సమీపంలోని తిరువూరుకు చెందిన సాయిల్ సే ఆర్గానిక్ వెజిటబుల్ ప్రొడక్షన్ కంపెనీ నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్‌లో కళాశాలకు చెందిన 30 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో 12 మంది ఎంపికయ్యారు. కంపెనీ ప్రతినిధులు రాత పరీక్షలతో పాటు మౌఖిక ఇంటర్వ్యూలను జరిపారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ బచ్చు శ్రీనివాస్‌రావు, డైరెక్టర్ బచ్చు కిరణ్ కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ అమృత గాయత్రి, కళాశాల ఇన్‌చార్జి బాషా పాల్గొన్నారు.

నిర్లక్ష్యంతో నిండు ప్రాణాలు బలి

గుంటూరు మెడికల్: వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యంతోనే యువకుడి ప్రాణం పోయిందని వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు నూరిఫాతిమా ఆరోపించారు. జీజీహెచ్‌లో వైద్యుల నిర్లక్ష్యంతో చనిపోయిన షేక్ సైదా కుటుంబ సభ్యులను షేక్ నూరిఫాతిమా పరామర్శించారు. భౌతికాయాన్ని సందర్శించి, మృతికి గల కారణాలు వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. జనరల్ వార్డుకు తరలించిన నాలుగు గంటల వ్యవధిలోనే సైదా చనిపోవడం వైద్యుల నిర్లక్ష్యానికి నిదర్శనమని తెలిపారు. యువకుడి మృతిపై ఆసుపత్రి అధికారులకు, పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. మృతిపై తక్షణమే విచారణ జరిపించి న్యాయం చేయాలని ఆమె కోరారు. వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి పరిపాలనలో వైద్య రంగం ఎంతో అభివృద్ధి చెందిందని, ముఖ్యంగా గుంటూరు జీజీహెచ్‌లో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చి అభివృద్ధికి కేరాఫ్‌గా ఆసుపత్రిని తీర్చిదిద్దారని వివరించారు. నేటి ప్రభుత్వం జీజీహెచ్‌ను పట్టించుకోవడం లేదని, అందువల్లే నిర్లక్ష్యం కనిపిస్తోందని విమర్శించారు.

జీజీహెచ్ రూపు రేఖలు మార్చామంటూ ప్రజాప్రతినిధులు చెబుతున్నప్పటికీ నిర్లక్ష్యం ఏమాత్రం మారలేదని విమర్శించారు. యువకుడి కుటుంబానికి అండగా ఉంటామని చెప్పారు. కడుపు నొప్పితో బాధపడుతూ మూడు రోజుల క్రితం క్యాజువాలిటీకి చికిత్స కోసం వెళ్లిన షేక్ సైదాను పరీక్షించిన వైద్యులు ఐసీయూకు తరలించారు. అక్కడ పూర్తి చికిత్స అందించకుండానే వైద్యులు పట్టించుకోకుండా 104 వార్డుకు తరలించారని, అందువల్లే తమ బిడ్డ చనిపోయాడంటూ సైదా కుటుంబ సభ్యులు మీడియాకు వెల్లడించారు.

కార్మికుల బకాయిలు చెల్లించాలి



తాడేపల్లి రూరల్: బ్రహ్మానందపురం ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు వేముల దుర్గారావు డిమాండ్ చేశారు. శనివారం ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు నిర్వహిస్తున్న రిలే దీక్షా శిబిరాన్ని ఆయన యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్‌తో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సిమెంట్ ఫ్యాక్టరీ లాకౌట్ ప్రకటించి 32 ఏళ్లు అవుతోందని.. ఇప్పటికీ కార్మికులకు రావాల్సిన బకాయిలు యాజమాన్యం చెల్లించలేదని విమర్శించారు. ప్రభుత్వాలు మారుతున్నా కార్మికుల సమస్యలు అలాగే ఉంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాగేశ్వరరావు, కొండయ్య, పిచ్చయ్య, ఆశీర్వాదం, గురవయ్య, ఇస్మాయిల్, దుర్గాభవాని, నాగేశ్వరరావు, షేక్ జానీ, లక్ష్మి, రమణమ్మ, ఇమాంబి, సారమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఛత్రపతి శివాజీ నాటక ప్రదర్శన

తెనాలి: కళా,సాహిత్యాల అఖిల భారతీయ సంస్థ సంస్కార భారతి, ఆంధ్రప్రదేశ్, సీబీఆర్ అకాడమీ ఆఫ్ స్పోర్ట్స్ అండ్ ఎడ్యుకేషన్ సంయుక్త నిర్వహణలో తెనాలిలో చారిత్రాత్మక నాటకం 'జయహో శ్రీ ఛత్రపతి శివాజీ మహారాజ్' ప్రదర్శించనున్నారు. స్థానిక కొత్తపేటలోని తెనాలి రామకృష్ణకవి కళా క్షేత్రంలో ఆదివారం సాయంత్రం 5.30 గంటలకు నాటక ప్రదర్శన ఉంటుందని శివాజీ స్మారక సమితి, హిందూ చైతన్య వేదిక, తెనాలి నిర్వాహకులు తెలియజేశారు. తొలిసారిగా డిజిటల్ టెక్నాలజీతో ప్రదర్శించనున్న ఈ నాటకంలో విజయవాడకు చెందిన డాక్టర్ రామన్ ఫౌండేషన్ వారి శ్రీ సాయిబాబా నాట్య మండలి కళాకారులు 60 మంది నటిస్తారని తెలిపారు. సంస్కార భారతి, ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు డాక్టర్ పీవీఎస్ కృష్ణ రచించిన ఈ నాటకాన్ని ఆయన దర్శకత్వంలోనే ప్రదర్శిస్తారని, హైదరాబాద్‌లోని సీబీఆర్ అకాడమి ఆఫ్ స్పోర్ట్స్ అండ్ ఎడ్యుకేషన్ అధినేత చలసాని బలరామయ్య సహకారం అందిస్తున్నట్లు వివరించారు. ఛత్రపతి శివాజీ పట్టాభిషేక మహోత్సవాల్లో భాగంగా జూన్ 8న సాయంత్రం 4 గంటలకు తెనాలిలో శోభాయాత్రను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



దుగ్గిరాల: దుగ్గిరాల–పెదపాలెం రోడ్డు నిర్మాణానికి విడుదలైన రూ.1.65 కోట్ల నిధులతో శనివారం శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. 3 కిలో మీటర్ల నుంచి 6.2 కిలో మీటర్ల వరకు నూతన బీటీ రోడ్డు నిర్మాణాన్ని మండలంలోని మోరంపూడి గ్రామంలో రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ జబీన్, మార్కెట్ యార్డు చైర్మన్ వి.యూన్నీరాణి, కె.శ్రీ అనిత, వెనిగళ్ల తదితర పార్టీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని టీడీపీ కార్యాలయంలో శనివారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. పార్టీ పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకటరావు ముఖ్యఅతిథిగా పాల్గొని శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. అమరావతి కంటి ఆసుపత్రి విజయవాడ వారి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించామని, సుమారు 172 మందికి కంటి పరీక్షలు నిర్వహించామని తెలిపారు. అవసరమైన వారికి కళ్ల అద్దాలను అందించామని అన్నారు. కార్యక్రమంలో అమరావతి కంటి ఆసుపత్రి వైద్యులు డాక్టర్ అలీ, బ్రాంచ్ హెడ్ పలగాని కోటిరత్నం, స్వరూప్, సౌమ్య, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో పలు కమిటీలకు నియామకాలు

తెనాలి: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల ప్రకారం తెనాలి పట్టణ, తెనాలి రూరల్, కొల్లిపర మండల పార్టీ కమిటీలను పార్టీ కేంద్ర కార్యాలయం శనివారం ప్రకటించింది. ఆయా కమిటీల వివరాలిలా ఉన్నాయి.

పట్టణ అధ్యక్షుడిగా దేసు శ్రీనివాసరావు



దేసు శ్రీనివాసరావు

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తెనాలి పట్టణ కమిటీ అధ్యక్షుడిగా దేసు శ్రీనివాసరావును నియమించారు. ఉపాధ్యక్షులుగా మేకల చిరంజీవి, చుక్కా ఆనంద్, ప్రధాన కార్యదర్శులుగా అరవపల్లి సిరికృష్ణ, తాడిబోయిన పెదబాబు, పఠాన్ షరీఫ్, రావి జనార్దన్‌రెడ్డి నియమితులయ్యారు. కార్యదర్శులుగా బిట్రా రామలింగేశ్వరరావు, మానేపల్లి ఆదిశేషగిరిరావు, ఎద్దు నాగరాజు, ఇస్లావత్ రమేష్‌నాయక్, భరణి శ్రీనివాసరావును నియమించారు. కార్యవర్గ సభ్యులుగా పిల్లి గోపి, షేక్ సైదా, ముద్దిబోయిన వెంకట శివకృష్ణ, పోతిరెడ్డి నాగరాజు, ముత్యాల పాండురంగారావు, షేక్ సుభాని, సంపతి నాగేశ్వరరావు, ఆరాధ్యుల నరేంద్ర, గొరికపూడి జోసెఫ్, లంకా శ్రీనివాసులు నియమితులయ్యారు.

మండల అధ్యక్షుడిగా చెన్నుబోయిన

పార్టీ తెనాలి రూరల్ మండల అధ్యక్షుడిగా చెన్నుబోయిన శ్రీనివాసరావు నియమితులయ్యారు. ప్రస్తుతం ఆయన మండల అధ్యక్షుడిగా కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఉపాధ్యక్షులుగా ముప్పవరపు మల్లి, కఠెవరపు శివయ్యను నియమించారు. ప్రధాన కార్యదర్శులుగా షేక్ అమీర్ బాషా, బడుగు ఆనంద్, రాచాబత్తుని విజయకుమార్, కొండముది కిరణ్‌చంద్ర, కార్యదర్శులుగా వాకా కోటేశ్వరరావు, నారంరాజు నాగరాజు, గోవతోటి సుధాకర్, కడియాల శివరామబ్రహ్మం, కాలిశెట్టి సుబ్బారావు నియమితులయ్యారు. కార్యవర్గ సభ్యులుగా దాసరి శ్రీనివాసరావు, తురకా రాజేష్, తోట శ్రీకాంత్‌ను నియమించారు.



చెన్నుబోయిన శ్రీనివాసరావు

కొల్లిపర మండల అధ్యక్షుడిగా వెంకటప్పారెడ్డి



కల్లం వెంకటప్పారెడ్డి

పార్టీ కొల్లిపర మండల అధ్యక్షుడిగా కల్లం వెంకటప్పారెడ్డి నియమితులయ్యారు. ఉపాధ్యక్షులుగా నాలాది బుజ్జిబాబు, ఆరిమండ కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శులుగా తాడికొండ రాంబాబు, అవుతు ఉమామహేశ్వరరెడ్డి, మర్రెడ్డి బ్రహ్మారెడ్డి, దేశబోయిన నాగేశ్వరరావును నియమించారు. కార్యదర్శులుగా పల్లె మధుసూదన్‌రావు, తాడిబోయిన రాంబాబు, తండటి జయకర్ నియమితులయ్యారు. కార్యవర్గ సభ్యులుగా మున్నంగి పాములు, కాటేపల్లి శ్రీనివాసరావు, పోకూరి ప్రభాకర్, అత్తోట సుబ్బారావు, షేక్ మౌలి, గండికోట శ్రీనివాసరావు, షేక్ అబుల్లా, ఈదా వెంకటరెడ్డి, మనుము గోపి, దూసరి అనిల్, ముక్కా సుదర్శన్‌లను నియమించినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం ప్రకటించింది.

ఛ్చ.. ఎందుకు ఆగిపోయిందో ?

- అసంపూర్తిగా భోజనశాల నిర్మాణం
- మధ్యలో పనులు నిలిపివేసిన కాంట్రాక్టర్
- ఇబ్బందులు పడుతున్న చినరావూరు గ్రామస్తులు
- నిర్మాణానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రూ. 20 లక్షలు మంజూరు



చినరావూరులోని కమ్యూనిటీ హాల్

తెనాలి అర్బన్: చినరావూరులోని కమ్యూనిటీ హాల్ పక్కన భోజనశాల నిర్మాణం అసంపూర్తిగా ఉంది. మున్సిపల్ అధికారులు కూడా పట్టించుకోకపోవడంతో ఆ ప్రాంతవాసులు ఇబ్బందులు పడుతున్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా అప్పటి వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ చినరావూరులో పర్యటించారు. ఆ సమయంలో ఆ ప్రాంతవాసులు లూథరన్ చర్చి ముందు ఉన్న మున్సిపల్ స్థలంలో ఉన్న కమ్యూనిటీ హాల్ పక్కన భోజనశాల నిర్మించాలని కోరారు. అప్పటి ప్రభుత్వం 13వ వార్డుకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా రూ.20 లక్షలను మంజూరు చేసింది. వాటిని భోజనశాల నిర్మాణానికి ఉపయోగించాలని కౌన్సిలర్ కుర్రా సుజాత, వైఎస్సార్ సీపీ నాయకులు కుర్రా శ్రీను కోరారు. ఎమ్మెల్యే శివకుమార్ వారి అభ్యర్థన మేరకు నిధులు కేటాయించారు. వీటితో రేకులు షెడ్డుతో పాటు సీలింగ్, ఫ్యాన్లు, టైల్స్, బాత్‌రూమ్స్, వాష్‌బేషిన్‌ల నిర్మాణాలు చేయాలి. అప్పటి కాంట్రాక్టర్ షెడ్డు నిర్మాణం చేసి మిగిలిన వర్క్స్ నిలిపివేసినట్లు కౌన్సిలర్ సుజాత తెలిపారు. 13, 14, 15 వార్డులలోని పేదలు కమ్యూనిటీ హాల్‌ను ఎక్కువగా ఉపయోగించుకుంటూ ఉంటారు. పక్కనున్న భోజనశాల అసంపూర్తిగా ఉండటం వల్ల అనేక ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి మిగిలిన పనులు కూడా పూర్తి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.



నిరుపయోగంగా వాష్ బేషిన్‌లు

నవ్వుతూ నవ్విస్తూ సానుకూల దృక్పథాన్ని పెంపొందిద్దాం



మాట్లాడుతున్న కావూరి సత్యనారాయణ

లక్ష్మీపురం: జీవితాన్ని వృథా చేయవద్దని, నవ్వుతూ నవ్విస్తూ మన చుట్టూ ఉన్న వారిలో సానుకూల దృక్పథాన్ని పెంపొదిద్దామని తద్వారా మనతో పాటు వారి ఆరోగ్యాన్ని పెంచుదామని ప్రముఖ నాటక రచయిత కావూరి సత్యనారాయణ అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, హాస్య వల్లరి బృంద సభ్యుల ఆధ్వర్యంలో శనివారం నవ్వండి, నవ్వించండి కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ హాస్యం ఒక ఆప్త మిత్రుని వంటిదని, అది మనల్ని నవ్విస్తుంది, కవ్విస్తుంది, ఆనంద పరవశుల్ని చేస్తుందన్నారు. హాస్యం ఒక గొప్ప ఔషధంలా కూడా పని చేస్తుందన్నారు. ప్రముఖ మెజీషియన్ ఆర్.పి.ఎల్.నరసింహారావు మాట్లాడుతూ నవ్వు ఒక్క టెన్షన్ కే కాదు, చాలా వాటికి విరుగుడని, ఒత్తిడి తగ్గించి మనసును తేలిక పరుస్తుందన్నారు. ఆరోగ్యానికి అది పరమౌషధమని పేర్కొన్నారు. జీవితంలో వృథాగా గడిచిన రోజంటూ ఏదైనా ఉంది అంటే అది నవ్వకుండా గడిపిన రోజేనని అందరూ తెలుసుకోవాలని చెప్పారు. అనంతరం హాస్య వల్లరి బృందం జోక్స్, హాస్య, వ్యంగ్య సంభాషణలతో, కామెడీ స్కిట్స్‌తో హాస్య ప్రియులు ప్రసాద్, గుప్త, పింగళి భాగ్యలక్ష్మి, జమదగ్ని, వివి రావ్, అప్పారావు లు అందరినీ కడుపుబ్బ నవ్వించారు.

యోగాంధ్ర యాప్‌పై అవగాహన




కార్యక్రమంలో మెప్మా అధికారులు

మంగళగిరి టౌన్: జూన్ 21వ తేదీన అంతర్జాతీయ యోగ దినోత్సవాన్ని పురస్కరించుకుని దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో యోగాంధ్ర యాప్‌పై అవగాహన కార్యక్రమాన్ని అధికారులు చేపడుతున్నారు. మంగళగిరి నగర పరిధిలోని ఎంటీఎంసీ కార్యాలయంలో మెప్మా ఆధ్వర్యంలో డ్వాక్రా ఆర్‌సీలకు యోగాంధ్ర యాప్‌పై శనివారం అవగాహన కల్పించారు. మెప్మా అధికారులు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఈ యోగాంధ్ర యాప్‌లో నమోదు కావాలని సూచించారు. జూన్ 21న విశాఖపట్నంలో జరగనున్న యోగా కార్యక్రమానికి ప్రధాని మోదీ హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా ప్రతి ఒక్కరికీ యోగాపై అవగాహన కల్పిస్తున్నామని తెలియజేశారు. కార్యక్రమంలో మెప్మా మంగళగిరి సిటీ మిషన్ మేనేజర్ మాలతి, కమ్యూనిటీ ఆర్గనైజర్లు సుధాకర్, నాగజ్యోతి, డ్వాక్రా సంఘాల ఆర్‌పీలు పాల్గొన్నారు.

యమ డేంజర్



వైకుంఠపురానికి వెళ్లే కాల్వకట్ట రోడ్డులో అయ్యప్పస్వామి గుడి వద్ద ..



నాజరుపేటలోని కాంచనమాల టవర్స్ దగ్గర..



నాజరుపేటలో కోర్టుల పక్కన ఎన్‌వీఆర్ కన్వెన్షన్ రోడ్డులో ..

పట్టణంలో ఏనాడో వేసిన సిమెంటు రోడ్లు దెబ్బ తింటున్నాయి. రోడ్డు మధ్యలో లోతైన గాడులు పడి ద్విచక్ర వాహనదారులు ప్రమాదానికి గురవుతున్నారు. ముత్యంశెట్టిపాలెం నుంచి కాల్వ కట్టపై వైకుంఠపురం దేవస్థానానికి వెళ్లే రోడ్డులో భారీ పగులు ఏర్పడింది. వారం రోజుల కిందట ఆ మార్గాన ద్విచక్ర వాహనంపై వెళుతున్న భార్యాభర్తలు కిందపడి పోయారు. అదృష్టవశాత్తూ పెద్ద గాయాలు తగల్లేదు. పట్టణ నాజరుపేటలోని కోర్టుల సముదాయం, ఎన్‌వీఆర్ కన్వెన్షను రోడ్డు, సెయింట్ జాన్స్ కాన్వెంట్ పక్కగా సంకా వారి కోట్ల బజారుకు వెళ్లే రోడ్డు, అక్కడకు దగ్గర్లోనే కాంచనమాల టవర్స్ ముందు నుంచి రామలింగేశ్వరపేట వెళ్లే రోడ్లపై ఇలాగే పగుళ్లు ఏర్పడ్డాయి. ద్విచక్ర వాహనాలు జారిపోయి బోల్తా కొట్టే ప్రమాదం ఉంది. ప్రమాదాలు జరిగింతర్వాత అయ్యో! అనుకోవటం కన్నా ఆ పగుళ్లలో కాస్తంత తారు వేస్తే వాటిని నివారించవచ్చు. మున్సిపల్ అధికారులు, పాలకులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. – తెనాలి



నాజరుపేటలో సెయింట్‌జాన్స్ కాన్వెంట్ పక్కన ..